సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం । 1 । మార్చి । 2025



నేటి నుంచి కొల్లేటికోటలో జాతర

కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతర, కలిదిండి మరియమాత మహోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. సీఐ వి.రవికుమార్ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.



ఘనంగా తెప్పోత్సవం

భీమవరం (ప్రకాశంచౌక్): పంచారామక్షేత్రం ఉమా సోమేశ్వర జనార్దనస్వామి దేవస్థానంలో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమగుండం చెరువులో తెప్పోత్సవం నిర్వహించారు.



హుండీ ఆదాయం లెక్కింపు

కైకలూరు: కలిదిండి పార్వతీ సమేత పాతాళ భోగేశ్వరస్వామి ఆలయానికి శివరాత్రి ఉత్సవాల్లో హుండీల ఆదాయం, చదివింపుల రూపంలో రూ.27,44,437 నమకూరింది.

కూటమి.. సూపర్ దగా

రాష్ట్ర బడ్జెట్‌లో సూపర్ సిక్స్ హామీల అమలుకోసం గంపెడాశతో ఎదురుచూస్తున్న పేదవర్గాల వారికి కూటమి ప్రభుత్వం మళ్లీ మొండిచేయి చూపింది. మూడు ప్రధాన హామీల ప్రస్తావనే లేకపోగా, మరో మూడింటికి భారీగా కోత పెడుతూ అరకొర కేటాయింపులు చేసింది. డ్వాక్రా మహిళలకు టోకరా వేసింది. కూటమి వంచనపై పేదలు పెదవి విరుస్తున్నారు.

సంక్షేమం విడిచి.. హామీలు విస్మరించి..

- బడ్జెట్‌లో ఎన్నికల హామీలను గాలికొదిలేసిన సర్కారు
- ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, ఉచిత బస్సుకు కేటాయింపులు నిల్
- దీపం, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనంకు అరకొరగానే..
- డ్వాక్రా మహిళలకు మొండిచేయి
- కూటమి బడ్జెట్‌పై పేదల పెదవి విరుపు



ఒక్కటే సిలిండర్

- మొత్తం రేషన్‌కార్డులు 5,67,651
- ఒక్కో కార్డుపై ఏడాదికి మూడు చొప్పున ఇవ్వాల్సిన సిలెండర్లు 17,02,953
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇస్తున్న సిలెండర్లు 5,67,651
- లబ్ధిదారులు కోల్పోయిన సిలెండర్లు 11,35,302
- పేదలు నష్టపోయిన మొత్తం రూ.93.94 కోట్లు

ఆడబిడ్డకు అన్యాయం

- మహిళలకు ప్రతి నెలా రూ.1,500
- జిల్లాలో 18 ఏళ్లు నిండిన మహిళలు 7,51,313
- సామాజిక పింఛన్లు పొందుతున్న మహిళలు 1.55 లక్షలు
- రూ.1,500 పొందేందుకు అర్హులు 5,96,313
- ఆడబిడ్డ నిధి కింద ప్రతినెలా మహిళలు నష్టపోతున్న మొత్తం రూ.89.45 కోట్లు

సాక్షి, భీమవరం: ఎన్నికల ప్రచారంలో భాగంగా గతేడాది ఏప్రిల్ 5న నరసాపురం, పాలకొల్లు, ఏప్రిల్ 10న తణుకు, ఏప్రిల్ 21న నరసాపురం, భీమవరం, ఏప్రిల్ 29న తాడేపల్లిగూడెం, మే 10న ఉండి బహిరంగ సభల్లో పాల్గొన్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు సూపర్ సిక్స్ హామీలను ఊదరగొట్టారు. పాలనలోకి వచ్చిన మొదటి నెల నుంచే హామీలను అమలు చేస్తామన్నారు. తల్లికి వందనంగా ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు ఎందరుంటే అంతమందికి ఇస్తామన్నారు. రైతులకు ఏటా రూ.20 వేలు పెట్టుబడి సాయం చేస్తామన్నారు. నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల భృతి, ఆడబిడ్డ నిధిగా 18 నుంచి 60 ఏళ్లలోపు మహిళలకు నెలకు రూ.1,500లు ఇస్తామన్నారు. ప్రతి ఇంటికీ ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితమన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని **చెప్పారు. అయితే అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలైనా ఒక్క హామీని అమలు చేయలేదు. పాలన చేపట్టాకా** రూ.1.45 లక్షల కోట్ల వరకు అప్పులు తెచ్చిన కూటమి ప్రభుత్వం ఒక్క రూపాయినీ ఆయా సంక్షేమ కార్యక్రమాలకు వెచ్చించలేదు.

కేటాయింపులు నిల్

శుక్రవారం శాసనసభలో చంద్రబాబు సర్కారు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆడబిడ్డ నిధి, నిరుద్యోగభృతి, ఉచిత బస్సు హామీల ప్రస్తావనే లేదు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, దీపం పథకాలకు అరకొర కేటాయింపులు చేశారు. గతంలోనూ తల్లికి వందనంకు కేటాయింపులు చేసినా అమలుచేయలేదు. ఎన్నికల్లో డ్వాక్రా మహిళలకు రూ.10 లక్షల వరకు వడ్డీలేని రుణాలు ఇస్తామని చెప్పినా బడ్జెట్‌లో ఊసే లేదు.

ఉద్యోగులకు నిరాశ

భీమవరం (ప్రకాశంచౌక్): రాష్ట్ర బడ్జెట్‌లో 12వ పీఆర్సీకి నిధులు కేటాయిస్తారని ఆశతో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులు నిరాశకు గురయ్యారని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి జి.ప్రకాశం, బీవీ నారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు కావస్తున్నా పీఆర్సీకి నిధులు కేటాయించకపోవడం, ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయి పడ్డ రూ.25 వేల కోట్ల ప్రస్తావన బడ్జెట్‌లో లేకపోవడం దారుణమని విమర్శించారు.

తల్లికి ఎగనామం

- జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ఇంటర్ విద్యార్థులు : 2,49,662
- అర్హులైన విద్యార్థులు (70 శాతం) సుమారు 1,74,763
- తల్లికి వందనంగా ఈ విద్యా సంవత్సరంలో తల్లులు నష్టపోయిన మొత్తం రూ.262.14 కోట్లు

నిరుద్యోగులకు అందని భృతి

- జిల్లాలో కుటుంబాలు 5.17 లక్షలు
- రూ.3 వేల ఆర్థిక సాయం కోసం ఎదురుచూపు

అన్నదాతకు లేదు భరోసా

- జిల్లాలో సాగు భూమి 2.3 లక్షల ఎకరాలు
- రైతులు 1,24,645 మంది
- అన్నదాత సుఖీభవ అందక రైతులు నష్టపోయిన సాయం రూ.249.29 కోట్లు

ఉచిత బస్సు.. తుస్సు

- జిల్లాలో జనాభా : 19,00,228
- పురుషులు : 9,48,461
- మహిళలు: 9,51,766
- ఎన్నికల హామీ మేరకు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాల్సి ఉంది

సూపర్ సిక్స్ బూటకం



సంపద సృష్టిస్తానని మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేసిన ఘనుడు చంద్రబాబు. బడ్జెట్‌లో పేదలకు ఒరిగిందేమీ లేదు. సూపర్ సిక్స్ హామీలు బూటకమని మరోసారి నిరూపితమైంది. నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు ప్రయాణం, డ్వాక్రా మహిళలకు రూ.10 లక్షల వరకు సున్నా వడ్డీ రుణాలు, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ మాటేంటి. బడ్జెట్‌లో అంకెల గారడీ తప్ప కేటాయింపుల్లో కోతలు ఎక్కువగా ఉన్నాయి. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలకు భారీగా కోతలు పెట్టారు. కాపు సంక్షేమానికి రూ.15 వేల కోట్ల కేటాయింపులు లేవు. చంద్రన్న బీమాకు నిధులు ప్రకటించలేదు.

– కారుమూరి వెంకట నాగేశ్వరరావు, మాజీ మంత్రి

మొండిచేయి చూపారు



నిరుద్యోగ భృతి, ఉచిత బస్సు వంటి సూపర్‌సిక్స్ హామీల అమలుకు రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. డ్వాక్రా మహిళలకు రూ.10 లక్షల వరకు సున్నా వడ్డీకే రుణాలు, మహిళలకు నెలకు రూ.1,500 ఇస్తామన్న హామీల అమలుకు మొండిచేయి చూపారు. ఉద్యోగులు, కార్మికుల సంక్షేమానికి నిధులు కేటాయించలేదు. ప్రభుత్వోద్యోగాల కల్పన ఊసే లేదు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలకు అరకొర నిధులే కేటాయించారు.

–కోనాల భీమారావు, సీపీఐ జిల్లా కార్యదర్శి

ఒక్కరికీ ఇచ్చేలా లేరు



బడ్జెట్‌లో తల్లికి వందనం పథకానికి కేవలం రూ.9,400 కోట్లు కేటాయించారు. ఎన్నికల్లో ఇంట్లో ఎందరు పిల్లలు ఉంటే అందరికీ రూ.15 వేల చొప్పున ఇస్తామన్నారు. నిజానికి ఒక్కో విద్యార్థికి ఇవ్వాలన్నా కూడా రూ.12 వేల కోట్లు కావాలి. మరి రూ.9,400 కోట్లు మాత్రమే కేటాయించారంటే ఒక్కరికి ఇవ్వడానికి కూడా ఎన్నో కొర్రీలు పెట్టేట్టుగా కనిపిస్తోంది. ఇప్పటికే ఒక ఏడాది ఇవ్వలేదు.

– సత్యవాణి, నరసాపురం

మోసం చేయడమే..



చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చే హామీలన్నీ నీటిమూటలేనని మరోసారి నిరూపించుకున్నారు. సూపర్ సిక్స్ పేరిట 19 నుంచి 59 ఏళ్ల మహిళలందరికీ నెలకు రూ.1,500 ఇస్తానని చెప్పడంతో మహిళలంతా ఆశపడి కూటమి అభ్యర్థులను గెలిపించారు. అధికారంలోనికి వచ్చి 9 నెలలకు కూడా ఆ హామీని నెరవేర్చలేదు. కనీసం బడ్జెట్‌లో కూడా ఆ ప్రస్తావన లేకపోవడం బాధాకరం. మహిళలను ఇలా మోసం చేయడం తగదు.

– శిరిగినీడి లక్ష్మీ సునీత, ఎంపీటీసీ, అబ్బిరాజుపాలెం

న్యూస్‌రీల్

చెత్త తొలగింపునకు చర్యలు



బొండాడపేటలో చెత్త తొలగిస్తున్న దృశ్యం

సాక్షి స్పందన

కాళ్ల: 'లక్షల్లో వ్యయం.. నెరవేరని లక్ష్యం' శీర్షికన 'సాక్షి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. కాళ్ల మండలంలోని బొండాడపేట గ్రామంలో పొలాలకు వెళ్లే రోడ్డు మార్జిన్‌లో చెత్త తొలగింపునకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకున్నారు. అలాగే ఇక్కడ ఎవరూ చెత్త వేయకుండా బోర్డును ఏర్పాటుచేసినట్టు సచివాలయ సెక్రటరీ మణికంఠ తెలిపారు. మండలంలో డంపింగ్ యార్డ్‌లను ఉపయోగంలోకి తీసుకొస్తామని అధికారులు తెలిపారు.

రెడ్‌జోన్‌లో మినహా చికెన్ తినొచ్చు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలోని వేల్పూరు గ్రామంలోని కృష్ణానందం కోళ్ల ఫారం నుంచి కిలోమీటర్ పరిధిలో, పెదతాడేపల్లిలోని రామలక్ష్మి కోళ్ల ఫారం నుంచి కిలోమీటర్ మినహా జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో గుడ్లు, చికెన్ విక్రయాలపై ఎలాంటి ఆంక్షలు లేవని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ప్రజలు అపోహలు వీడి ఉడికించిన గుడ్లు, కోడి మాంసం ఆహారంగా తీసుకోవచ్చని పేర్కొన్నారు. చికెన్, గుడ్లు షాపులు, రెస్టారెంట్ యజమానులు వ్యాపారాలు కొనసాగించవచ్చని స్పష్టం చేశారు.

ప్రగతికి పరిశోధనలు కీలకం



నిట్‌లో సైన్స్ ప్రదర్శనలు

తాడేపల్లిగూడెం: దేశ ప్రగతికి సైన్స్ పరిశోధనలు కీలకమని వరంగల్ నిట్ గణిత విభాగం ఆచార్యులు జేవీ రమణమూర్తి అన్నారు. శుక్రవారం ఏపీ నిట్‌లో జరిగిన జాతీయ సైన్సు దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేశం గర్వించదగ్గ మేధావి సీవీ రామన్ అని అన్నారు. నిట్ రిజిస్ట్రార్ దినేష్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మకమైన ఆలోచనలతో ఆధునిక సాంకేతికతను జోడించి నూతన ఆవిష్కరణలను చేయాలన్నారు. డీన్‌లు హిమబిందు, జయరామ్, సందీప్, స్కూల్ ఆఫ్ సైన్సెస్ విభాగాధిపతి ఎం.అమరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లావ్యాప్తంగా శనివారం నుంచి జరిగే ఇంటర్మీడియెట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి ఎ.నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. జిల్లాలో 52 పరీక్షా కేంద్రాలు సీసీ కెమెరాలు పర్యవేక్షణలో ఉంటాయన్నారు. పరీక్షా కేంద్రానికి విద్యార్థులకు ఉదయం 8 గంటలకల్లా చేరుకోవాలని సూచించారు. కేజీఆర్‌ఎల్ జూనియర్ కళాశాలలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశామని, సమస్యలుంటే సెల్‌లో 94917 22692 సంప్రదించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించామని స్పష్టం చేశారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు అన్ని వసతులు కల్పించామని వివరించారు.

రేపు ట్రెజరీ సంఘ ఎన్నికలు

భీమవరం (ప్రకాశంచౌక్): ఆంధ్రప్రదేశ్ ట్రెజరీస్, అకౌంట్స్ సర్వీసెస్ జిల్లా సంఘ ఎన్నికలు ఆదివారం నిర్వహించనున్నట్టు ఉప ఖజానా అధికారి జె.రామారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. భీమవరంలోని జిల్లా ఖజానా, లెక్కల కార్యాలయ ప్రాంగణంలో ఎన్నికలు నిర్వహిస్తారని, ఎన్నికల అధికారులుగా రాష్ట్ర కార్యదర్శి షేక్ అబ్దుల్ ఖాదర్, జి.నరేంద్ర కుమార్, ఎన్నికల పరిశీలకులుగా ఎ.ఆంజనేయులు వ్యవహరిస్తారని తెలిపారు.

సమస్యాత్మక కేంద్రాలపై దృష్టి పెట్టాలి

ఏలూరు (టూటౌన్): ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షల్లో సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ జె.రాజేంద్రప్రసాద్ కోరారు. స్థానిక విద్యానగర్‌లో శుక్రవారం మాట్లాడుతూ ఇంటర్ పరీక్షల్లో ఎటువంటి వివాదాలు రాకుండా నిర్వహించాలన్నారు. ఫీజు చెల్లించని కారణంగా విద్యార్థులను యాజమాన్యాలు హాల్‌టికెట్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అధికారులు దృష్టి సారించాలని కోరారు.

కనుల పండువగా రథోత్సవం

ముగిసిన బలివే శివరాత్రి ఉత్సవాలు

బలివే(ముసునూరు): బలివేలోని రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద మహాశివరాత్రి ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయి. బలివే క్షేత్రానికి గురు, శుక్రవారాల్లో వేలాదిగా భక్తులు తరలి వచ్చి, తమ్మిలేరు, జల్లు స్నానాల వద్ద అమావాస్య స్నానాలాచరించి స్వామిని దర్శించుకున్నారు. పితృదేవతలకు ముక్తి కలగాలని బ్రాహ్మణులకు, పేదలకు దానాలు చేశారు. గురువారం రాత్రి స్వామికి బలివే గ్రామ వీధుల్లో వైభవంగా రథోత్సవం నిర్వహించారు. భక్తులు రాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వర స్వామి ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు. సీఐ రామకృష్ణ, ఎస్సై ఎం.చిరంజీవి బందోబస్తు నిర్వహించారు. శుక్రవారం ఉదయం బిందె తీర్థం, బలిహరణ, వసంతోత్సవం, అవభృతం, సాయంత్ర హోమం, బలిహరణాదులు, పూర్ణాహుతి, ద్వాదశ ప్రదక్షిణాలు నిర్వహించారు. రాత్రి ధ్వజావరోహణం చేసి భక్తి శ్రద్ధలతో పవళింపు సేవ నిర్వహించారు. దీంతో శివరాత్రి ఉత్సవాలు ముగిసినట్లు అధికారులు తెలిపారు.



బలివే వీధుల్లో రామలింగేశ్వరునికి రథోత్సవం

హుండీల ఆదాయం రూ.13.77 లక్షలు

మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా బలివే రామలింగేశ్వర స్వామి ఆలయానికి హుండీల ద్వారా రూ.13.77 లక్షల ఆదాయం లభించినట్లు ఈఓ పామర్తి సీతారామయ్య తెలిపారు. శుక్రవారం ఆలయం వద్ద ఉత్సవాల అధికారి కె.అనూరాధ పర్యవేక్షణలో హుండీల లెక్కింపు నిర్వహించారు. అనంతరం ఆదాయ వివరాలను వెల్లడించారు. శాశ్వత, తాత్కాలిక హుండీల ద్వారా రూ. 13,77,951 ఆదాయం లభించగా, పూజా టికెట్లు, విరాళాల ద్వారా స్వామికి సుమారు రూ.12 లక్షల ఆదాయం లభించిందన్నారు. కార్యక్రమాల్లో సర్పంచ్ రావు ప్రవీణ, భక్తులు పాల్గొన్నారు.

ఇన్‌కం ట్యాక్స్‌లో మార్పులపై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న విశాఖపట్నం ఇన్‌కం ట్యాక్స్ ప్రిన్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

ఏలూరు (టూటౌన్): ఈ ఆర్థిక సంవత్సరం నుంచి ఇన్‌కం ట్యాక్స్‌లో చాలా మార్పులు వస్తున్నాయని, దీనిపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని విశాఖపట్నం ప్రిన్సిపల్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కం ట్యాక్స్ బి.శ్రీనివాస్ అన్నారు. ఏలూరు డివిజన్ ఇన్‌కం ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో స్థానిక అతిథి హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన హాజరై మాట్లాడారు. ఇంట్లో నుంచే రిటర్న్లు దాఖలు చేసే అవకాశం ఏర్పడిందన్నారు. మార్చి 15 లోపు అడ్వాన్స్ ట్యాక్స్‌లు చెల్లించాలని గుర్తుచేశారు. ఆదాయ పన్ను సక్రమంగా చెల్లించినవారికి తమ శాఖ నుంచి ఎలాంటి ఇబ్బందులూ ఉండవన్నారు. సదస్సులో రాజమహేంద్రవరం అడిషనల్ కమిషనర్ డి.హేమ భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

పైడిపర్రులో భారీ చోరీ

39 కాసుల బంగారం, రూ.40 వేల నగదు అపహరణ

తణుకు అర్బన్: ఇంట్లో ఉండగానే.. బీరువా తలుపులు తెరిచి చోరీ చేసిన ఘటన తణుకు శివారు పైడిపర్రులో జరిగింది. శుక్రవారం వేకువజామున 4 గంటల సమయంలో జరిగిన ఈ చోరీలో 39 కాసుల బంగారు ఆభరణాలు, కిలో వెండి, రూ.40 వేల నగదు దొంగలు దోచుకున్నట్లు బాధితులు చెబుతున్నారు. తణుకు మండలం పైడిపర్రులో నివసిస్తున్న తాటికాయల వెంకటేశ్వరరావు శుక్రవారం వేకువజామున లేచి బాత్రూంలోకి వెళ్లారు. ఇంటి తలుపులు దగ్గరకు వేసి వెళ్లడంతో లోపలకు ప్రవేశించిన దొంగలు బీరువా తెరిచి బంగారు ఆభరణాలు, నగదు దోచుకెళ్లారు. బీరువా పక్కనే మంచంపై నిద్రిస్తున్న భార్య వీరవేణికి లైటు వెలుగు పడగానే మెలకువ వచ్చినా తన భర్త అనుకుని పక్కకు తిరిగి పడుకున్నారు. ఇదే అదనుగా దొంగ తన పని తాను చేసుకుని వెళ్లాడు. కొద్దిసేపటికి లోనికి వచ్చిన వెంకటేశ్వరరావు బీరువా తెరచి ఉండడాన్ని చూసి కేకలు వేశారు. ఇంటి ఆవరణలోని అరుగుపై తచ్చాడుతున్న దొంగను చూసి బిగ్గరగా అరవడంతో పారిపోయిన దొంగ కొద్ది దూరంలో ద్విచక్రవాహనంపై వేచిఉన్న మరో వ్యక్తితో కలిసి ఉడాయించాడు.



బాధితులతో మాట్లాడుతున్న డీఎస్పీ విశ్వనాథ్

రోజూ ఉదయం 4 గంటలకు యజమాని నిద్రలేచి బయటకు వస్తారని తెలిసే దొంగలు వచ్చారని, ఈ ప్రాంతానికి చెందిన వారే అయిఉంటారని పోలీసులు భావిస్తున్నారు. తాడేపల్లిగూడెం డీఎస్పీ డి.విశ్వనాథ్, సీఐలు బి.కృష్ణకుమార్, ఎస్.కొండయ్య, ఎస్సైలు చంద్రశేఖర్, ట్రాఫిక్ ఎస్సై డి.ఆదినారాయణ, పోలీసులు ఈ ప్రాంతానికి వచ్చి పరిశీలించారు. ఇటీవల పైడిపర్రు ప్రాంతం వరుస దొంగతనాలతో అట్టుడుకుతోంది. ఈనెల 17న 6 ఇళ్లలో దొంగలు స్వైర విహారం చేశారు. ఈ దొంగతనాలన్నీ తణుకు రూరల్ పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో జరగడం విశేషం. వరుస ఘటనలు జరుగుతున్నా పోలీసులు తగు చర్యలు తీసుకోవడం లేదని, రాత్రి బీట్‌లు సరిగా నిర్వహించడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

అదుపుతప్పి అంబులెన్స్ బోల్తా

ప్రాణాపాయం నుంచి తప్పించుకున్న హృద్రోగి



పాతూరు వద్ద బోల్తా కొట్టిన అంబులెన్స్



క్షతగాత్రులను మరో అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

భీమడోలు: హృద్రోగిని విజయవాడ తరలిస్తున్న ప్రైవేట్ అంబులెన్స్ అతివేగంతో అదుపుతప్పి రోడ్డుపై డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ సంఘటన జాతీయ రహదారిపై సూరప్పగూడెం పంచాయతీ శివారు పాతూరు షుగర్స్ ఫ్యాక్టరీ వద్ద శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి తాడేపల్లిగూడెంలో గుండె వ్యాధితో బాధపడుతున్న పల్లి వీరాస్వామిని ప్రైవేట్ అంబులెన్స్‌లో విజయవాడ తరలిస్తున్నారు. వీరాస్వామితో పాటు ఆయన భార్య ఉదయకుమారి కూడా ఉన్నారు. మార్గమధ్యలో పాతూరు వద్ద ట్రాక్టర్ అకస్మాత్తుగా రోడ్డుపైకి రావడంతో తప్పించబోయి అంబులెన్స్ బోల్తా కొట్టింది. వీరాస్వామికి ఎటువంటి ప్రమాదం జరగకపోగా ఉదయకుమారి, డ్రైవర్ కృష్ణారెడ్డి, టెక్నీషియన్ గంగరాజుకు గాయాలయ్యాయి. రోగితో పాటు ఆమె భార్యను మరో అంబులెన్స్‌లో విజయవాడ తరలించారు. డ్రైవర్, టెక్నీషియన్‌ను 108లో తాడేపల్లిగూడెంలో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. భీమడోలు ఎస్సై వై.సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్సీ స్థానానికి రీ పోలింగ్‌కు డిమాండ్

బీఎస్‌ఎఫ్ అధ్యక్షుడు శ్రీనివాస్

సాక్షి, న్యూఢిల్లీ: ఉభయ తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి రీ పోలింగ్ నిర్వహించాలని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండపల్లి శ్రీనివాస్ కేంద్ర ఎన్నికల సంఘానికి డిమాండ్ చేశారు. ఎన్డీఏ (టీడీపీ) కూటమి అభ్యర్థికి గట్టి పోటీ ఇస్తాననే ఉద్దేశంతో అధికార పార్టీకి చెందిన నాయకులతో ఎన్నికల అధికారులు కుమ్మక్కై, తన నామినేషన్‌ను కుట్రపూరితంగా రిజెక్ట్ చేసి పోటీలో లేకుండా తప్పించారని ఆరోపించారు. శుక్రవారం ఢిల్లీలో శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడారు. తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేశానన్నారు. తనకు జరిగిన అన్యాయంపై రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కలిసి ఈనెల 12 ఫిర్యాదు చేశానని.. అయితే అక్కడ న్యాయం జరగకపోవడంతో 25న కేంద్ర ఎన్నికల సంఘానికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. విచారణ జరిపి తన నామినేషన్‌ను పునరుద్ధరించాలని, రీ పోలింగ్ నిర్వహించాలని కోరారు.

నేత్రపర్వం.. త్రిశూల స్నానం

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకుడిగా విరాజిల్లుతోన్న భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఆలయంలో విశేష కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు తీర్థపు బిందె, నిత్యహోమం, బలిహరణ, గణపతిపూజ అనంతరం స్వామివారికి అభిషేకం, అమ్మవార్లకు కుంకుమార్చన నిర్వహించారు. ఆ తరువాత ఆలయ ఆవరణలో శివయ్యకు త్రిశూల స్నానాన్ని అట్టహాసంగా జరిపారు. అనంతరం గంగా, పార్వతీ సమేత శివదేవుని గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వసంతోత్సవాన్ని కన్నుల పండువగా జరిపారు. రాత్రి ఆలయంలో స్వామివారికి 21 చుట్లు పల్లకి సేవ నిర్వహించారు.



త్రిశూల స్నానం నిర్వహిస్తున్న దృశ్యం

స్ట్రాంగ్‌రూమ్‌లకు బ్యాలెట్ బాక్సులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో బ్యాలెట్ బాక్సులు ఏలూరు చేరుకున్నాయి. ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు మన్యం, కాకినాడ జిల్లాల నుంచి పటిష్ట భద్రత నడుమ బ్యాలెట్ బాక్సులను గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు సిబ్బంది తీసుకువస్తూనే ఉన్నారు. బ్యాలెట్ బాక్సులను ఏలూరు సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్‌లకు అధికారులకు తరలించారు. ఇక్కడ మూడంచెల భద్రత ఏర్పాటుచేశారు. ఎన్నికల పరిశీలకులు సీహెచ్ శ్రీధర్, రిటర్నింగ్ అధికారి కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జేసీ పి.ధాత్రిరెడ్డి, డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, ఆర్డీఓలు అచ్యుత్ అంబరీష్, రమణ పర్యవేక్షించారు.

గూడెంలో పడకేసిన పారిశుద్ధ్యం

- మొక్కుబడిగా స్వచ్ఛాంధ్ర..స్వచ్ఛ దివస్
- కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్న చెత్త
- పగలు, రాత్రి తేడా లేకుండా దోమల దండయాత్ర
- చోద్యం చూస్తున్న అధికారులు




తాడేపల్లిగూడెం పట్టణంలో రోడ్డుపై వ్యర్థాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): గూడెం పట్టణంలో పారిశుద్ధ్యం పడకేసింది. ఏ వీధిలో చూసినా కుప్పలు తెప్పలుగా పేరుకుపోయిన చెత్త దర్శనమిస్తోంది. ప్రధాన రహదారుల్లో సైతం చెత్త కుప్పలు పేరుకుపోయాయి. పట్టణంలో పారిశుద్ధ్య పనులు నిర్వహణను గాలికొదిలేశారు. ప్రధాన రోడ్ల పొడవునా, వీధుల్లో చెత్త పేరుకుపోవడంతో దోమలకు అవాసాలుగా మారాయి. పారిశుద్ధ్య కార్మికులు ఉన్న పంచాయతీల్లో సైతం పారిశుద్ధ్యాన్ని విస్మరించడం శోచనీయం. ఎక్కడ చూసినా అపరిశుభ్రతే తాండవిస్తోంది. పట్టణంలో వన్ టౌన్, టూ టౌన్‌లలో పురపాలక సంఘం పరిధిలోని కె.ఎన్‌రోడ్డు మార్గంలో మురుగు డ్రెయినేజీల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించే కార్యక్రమం జోరుగా సాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా మురుగు కాలువలపై వేసిన కల్వర్టులను తొలగించి డ్రెయినేజీ నుంచి తీసిన వ్యర్థాలను రోడ్డు వారగా వేస్తున్నారు. దీంతో వ్యర్థాలు భారీ మొత్తంలో ఉండటంతో అవి పెద్ద పెద్ద గుట్టలుగా కనిపిస్తున్నాయి. వాహనదారులకు, పాదచారులకు ఈగుట్టలు కారణంగా ప్రయాణించేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. వ్యర్థాలను రోజుల తరబడి తొలగించకపోవడం వల్ల దుర్వాసన వెదజల్లుతున్నాయి. దీంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నామని ప్రజలు వాపోతున్నారు.

అలుముకున్న నిర్లక్ష్యం

సమయానికి విధులకు వచ్చామా..వెళ్లామా అనే ధ్యాసే తప్ప పనుల్లో జవాబుదారీ తనం కొరవడింది. పారిశుద్ధ్యంపై అధికారుల నిర్లక్ష్య ధోరణి బాగా పెరిగింది. పట్టణ స్థాయి అధికారులు సైతం పారిశుద్ధ్యంపై పట్టించుకోవడం మానేశారు. స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఆర్భాటంగా నిర్వహించడం మరునాడే వదిలేయడం పరిపాటిగా మారిపోయింది. పారిశుద్ధ్య నిర్వహణ చేతులెత్తేశారు. డ్రెయినేజీ వ్యవస్థ మరీ దారుణంగా ఉంది. మురుగునీరు వెళ్లే దారి లేక ఎక్కడికక్కడే నీరు స్తంభించిపోయి దుర్వాసన వస్తోంది. పట్టణంలో పేరుకుపోతున్న చెత్త చెదారానికి తోడు దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. రాత్రి, పగలు తేడా లేకుండా దోమలు ప్రజలపై దండయాత్ర చేస్తూ రోగాలకు గురి చేస్తున్నాయి. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీమన్నారాయణ వివరణ కోరగా టూ టౌన్‌లో కె.ఎన్.రోడ్డు మార్గంలో తాళ్లముదునూరుపాడు నుంచి హౌసింగ్‌బోర్డు వరకు గత 20 రోజులుగా రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ వ్యర్థాలను తొలగించే కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు.

వ్యర్థాలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం



కె.ఎన్.రోడ్డులో డ్రెయినేజీ వ్యర్థాలు తీసే పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. వ్యాపారస్తులు డ్రెయిన్‌లపై కల్వర్ట్ శ్లాబ్‌లు (కాంక్రీట్ దిమ్మలు) వేయడంతో చాలా ప్రదేశాల్లో మురుగు నిల్వలు పేరుకుపోతున్నాయి. దీంతో ఎప్పటికప్పుడు వ్యర్థాలు తొలగించడం కష్టసాధ్యమవుతుంది. జేసీబీలు సహాయంతో రాళ్లు తీసి, ప్రత్యేక డ్రైవ్‌లు ద్వారా వ్యర్థాలను తొలగిస్తున్నాం.

– ఎం.ఏసుబాబు, మునిసిపల్ కమిషనర్

ఎమ్మెల్సీ లక్ష్మణరావుపై కూటమి దాడి అమానుషం

తణుకు అర్బన్: ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావుపై దాడి చేసిన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ లక్ష్మణరావుపై టీడీపీ కూటమి కార్యకర్తలు మంగళగిరిలో దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ శుక్రవారం తణుకు బార్ అసోసియేషన్ భవనం వద్ద నిరసన తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే విధంగా కూటమి ప్రభుత్వ వ్యవహరిస్తుందని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో దాడులకు దిగడం సిగ్గుచేటని అన్నారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీలు ప్రజల పక్షాన గత 20 సంవత్సరాల నుంచి అలుపెరగని పోరాటాలు చేస్తున్నారని దీన్ని చూసి ఓర్వలేక ఈ దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు జి.అంబేడ్కర్, పొట్ల సురేష్, నేతల సోమేశ్వరరావు, బి. రాజేంద్ర ప్రసాద్, వి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ

పెంటపాడు: వ్యక్తిత్వ వికాసం ద్వారానే విద్యార్థుల్లో దాగి ఉన్న భయం తొలగి విజయం వరిస్తుందని పెంటపాడు ఎంఈవో టీవీ రామకృష్ణ, మానవత మండల అధ్యక్షుడు తారాడి పోలులు పేర్కొన్నారు. అలంపురం జెడ్పీస్కూల్, మీనవిల్లూరు జెడ్పీ స్కూల్ వద్ద మానవత జిల్లా విద్యాకమిటీ చైర్మన్ తాడేపల్లి మోహనరావు ఆధ్వర్యంలో ఆయా పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మానవత తరపున స్టడీ మెటీరియల్, ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు శారథ, సంతోష్, ఆయా పాఠశాల ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పట్టణ ఫొటోగ్రాఫర్స్ అధ్యక్షుడిగా గంగాధర్



గంగాధర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఫొటోగ్రాఫర్స్ నూతన అధ్యక్షుడిగా గోల్డెన్ ఫోటో స్టూడియో అధినేత కాపక గంగాధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేషన్ సర్వసభ్య సమావేశం శుక్రవారం టీటీడీ కల్యాణ మండపంలో జరిగింది. మిగిలిన నూతన కార్యవర్గ సభ్యులను స్టీరింగ్ కమిటీ, సీనియర్ ఫొటోగ్రాఫర్ల సమక్షంలో త్వరలో ఏర్పాటు చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎం.రాము, ఎం.చిరంజీవి, బి.సురేష్, ఆశీర్వాదరావు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): రెండు సంవత్సరాలుగా ఉన్న పెండింగ్ సమస్యలను పరిష్కరించి బ్యాంకు ఉద్యోగుల సమ్మెను నివారించాలని ఏపీ బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి టీవీ సూర్యనారాయణ, ఎస్‌బీఐ అధికారుల సమాఖ్య జోనల్ సెక్రటరీ జి.జవహర్‌లాల్‌లు పేర్కొన్నారు. మార్చి 24, 25 తేదీల్లో తలపెట్టిన రెండు రోజుల బ్యాంకుల సమ్మె కార్యాచరణలో భాగంగా శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి బ్యాంక్ ఉద్యోగులు నిరసన ప్రకటించారు. పట్టణ, రూరల్ ప్రాంతాలకు చెందిన బ్యాంక్ సిబ్బంది, యూఎఫ్‌బీయూ పర్యవేక్షణలో జరిగిన నిరసనలో వక్తలు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమ్మెను నివారించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీబీఈ నాయకులు పవన్ కుమార్, ఎం.కిరణ్, బి.దివ్యరజని, చైతన్య, శ్రీనివాస్, ఏడుకొండలు, గాంధీ, ఎస్.ఎస్.ప్రసాద్, కనకదుర్గా, వివిధ బ్యాంక్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కార్యశాలకు సర్పంచ్ వరలక్ష్మి ఎంపిక

తాడేపల్లిగూడెం రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 4వ తేదిన ఢిల్లీలో జరగనున్న కార్యశాల (వర్క్ షాప్)కు మండలంలోని నందమూరు గ్రామ సర్పంచ్ శనగన వరలక్ష్మి ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ వెల్లడించింది. జిల్లా నుంచి ఎంపికైన వారిలో వరలక్ష్మి ఒకరు కావడం విశేషం. ఈ సందర్భంగా ఆమెను పలువురు సర్పంచ్‌లు అభినందనలు తెలిపారు.

కేసుల రాజీపై కక్షిదారులకు అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి డి.సత్యవతి, చిత్రంలో న్యాయమూర్తులు

తణుకు అర్బన్: జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం ద్వారా కక్షిదారులకు పూర్తి శాస్వత పరిష్కారం దొరుకుతుందనే విషయాన్ని ఇరు పక్షాలకు అవగాహన కల్పించాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. తణుకు కోర్టులో శుక్రవారం పోలీసు, ఎక్సైజ్ విభాగ అధికారులకు నిర్వహించిన సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడారు. వివిధ తగాదాల్లో ఏర్పడ్డ కేసులు రాజీ చేసుకోవడం వలన కక్షిదారులు తమ విలువైన సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవచ్చని స్పష్టం చేశారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడ్డ క్రిమినల్ కేసులతోపాటు ఎక్సైజ్, చెక్కు బౌన్స్, ప్రామిసరీ నోటు, కుటుంబ తగాదా, అన్నిరకాలైన సివిల్, బ్యాంక్ రికవరీ, ప్రీలిటిగేషన్, టెలిఫోన్, బ్యాంక్ బకాయి కేసులు రాజీ చేసుకోవచ్చని అన్నారు. ఈనెల 8వతేదీన తణుకు కోర్టులో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణసత్యలత, స్పెషల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ తాడి ఆంజనేయులు, తణుకు కోర్టు పరిధిలో పనిచేయు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి గ్రామ కమిటీలు



జగ్గన్నపేట గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులను కలిసిన జిల్లా అధికార ప్రతినిధి ముప్పిడి సంపత్‌కుమార్

తాడేపల్లిగూడెం రూరల్: పార్టీని మరింత బలోపేతం చేయడానికి గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని జగ్గన్నపేట, పుల్లాయగూడెం, పెదతాడేపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించి, గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు గ్రామ, అనుబంధ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రభుత్వం చేపట్టిన పథకాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. పార్టీ అధికారంలో లేకపోయినా ప్రజల్లో ఉనికిని చాటుకోవాలన్నారు. ప్రజల సమస్యల పట్ల ఉత్సాహంగా పనిచేయాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు జడ్డు హరిబాబు, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ కనుపూరి ఉదయభాస్కర్, నాయకులు సిర్రాపు శాంతకుమార్, వెలిశెట్టి నరేంద్రకుమార్, పరిమి తులసీదాస్, తమ్మిశెట్టి రఘు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



వార్డుల్లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు పేర్కొన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రం కడకట్ల పరిధిలోని 28, 31 వార్డుల్లో శుక్రవారం జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పరిశీలన, ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన, క్షేత్రస్థాయి పరిశీలనలు, ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజలందరు ఆరోగ్య నియమాలు పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, వారానికి ఒక్కసారి డ్రై డే పాటించడం ద్వారా దోమలను అరికట్టవచ్చునని తెలిపారు. ప్రజలు తప్పక పారిశుద్ధ్య సిబ్బందికి, ఆరోగ్య సిబ్బందికి సహకరించాలని కోరారు. ఆరోగ్య కార్యకర్తలు చంద్రకళ, రమణ, ఆశాలు అనురాధ, రత్నకుమారి, ప్రశాంతి, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ టైలర్స్ డే వేడుకలు



తణుకులో కుట్టుమిషన్ సృష్టికర్త చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టైలర్స్ సంఘ నాయకులు



అత్తిలిలో టైలర్స్ డే సందర్భంగా మాట్లాడుతున్న సంఘ నాయకులు

తణుకు అర్బన్: ప్రపంచ టైలర్స్ డే సందర్భంగా తణుకులో శ్రీగంగయ్య టైలర్స్ ప్రాథమిక సహకార సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక సీతారామాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం కుట్టుమిషన్ సృష్టికర్త విలియమ్ ఎలియాస్ హువే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు కత్తుల దాన వెంకట సుబ్బారావు మాట్లాడుతూ టైలర్ వృత్తి ఎంతో గౌరవమైనదని, ఎంతో మంది టైలర్ వృత్తిపై ఆధారపడి ఉపాధి పొందుతున్నారని స్పష్టం చేశారు. వస్త్రానికి ఒక ఆకృతిని ఇచ్చి కళాత్మకంగా తీర్చిదిద్దేది దర్జీలేనని అన్నారు. హువే జయంతి సందర్భంగా ప్రపంచ టైలర్స్‌డేను నిర్వహించుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ, కోశాధికారి నూకెళ్ల వెంకటరత్నం, ముంగండ శ్రీనివాస్, గుత్తికొండ సుబ్బారావు, రాసాబత్తుల పుల్లారావు, ఏలూరి త్రిమూర్తులు, టి.పాండురంగారావు, బి.అనంతలక్ష్మి, రెడ్డి సూర్యనారాయణ పాల్గొన్నారు.

వేల్పూరులో..

వేల్పూరు టైలర్స్ వర్కర్స్ సంఘం ఆధ్వర్యంలో 180వ టైలర్స్ డే వేడుకను ఘనంగా నిర్వహించారు. ముందుగా సంఘ పతాకాన్ని సంఘ అధ్యక్షుడు మల్లేశ్వరపు నాగరాజు ఆవిష్కరించి, కుట్టుమిషను సృష్టికర్త విలియమ్ ఎలియాస్ హువే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వేల్పూరు గ్రామ సర్పంచ్ విశ్వనాథం కృష్ణవేణి, సంఘ గౌరవ అధ్యక్షులు బళ్ల చిన వీరభద్రరావు, వాసా వెంకటేశ్వరరావు, కుడకా వీరభద్రరావు, తాడిశెట్టి కోట వెంకటేశ్వరరావు, కర్రెళ్ల మల్లికార్జునరావు, రేవడి అంజి, పోలవరపు సూరిబాబు, విశ్వనాథం సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అత్తిలిలో ఘనంగా టైలర్స్ డే వేడుకలు

అత్తిలి: కుట్టుమిషన్ సృష్టికర్త విలియమ్స్ హోవే జన్మదినోత్సవం సందర్భంగా శుక్రవారం టైలర్స్‌డే వేడుకను అత్తిలిలో టైలర్స్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విలియమ్స్‌హోవే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టైలర్స్ సంఘం అధ్యక్షుడు సీఎస్ రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కొల్లి మోహనరావు, కొరిపల్లి హరి టైలర్ల సమస్యలపై మాట్లాడారు. 50 ఏళ్లు దాటిన ప్రతీ టైలర్‌కు పింఛన్, టైలర్‌షాపు ఉన్న ప్రతీ ఒక్కరికి ఉచిత విద్యుత్ సదుపాయం కల్పించేలా కూటమి ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. టైలర్ చిక్కాల శ్రీను మృతిచెందడంతో భార్య లక్ష్మికి సంఘం తరపున ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు జయకృష్ణ, కార్యదర్శి కె అప్పారావు, జాయింట్ కార్యదర్శి ఈ ప్రసాద్, కోశాధికారి ఎస్ మురళి, ఆర్‌ఆర్ టైలర్స్ రాము, పిల్లిరమణ, తిరునగరి శ్రీను, ఇంజేటి రవి పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం టైలర్లను ఆదుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో టైలర్స్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ టైలర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జి.బొబ్బిలి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం టైలర్స్‌ను ఆదుకోవాలన్నారు. విలియమ్స్ హో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టైలర్ అప్పారావును సత్కరించారు. టైలర్స్ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ రంగంపై పట్టు సాధించాలి

తణుకు అర్బన్: తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి సైన్స్ ప్రదర్శనలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.పద్మావతి మాట్లాడుతూ దినదినాభివృద్ధి చెందుతున్న సైన్స్ రంగంపై విద్యార్థులు పట్టుసాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు రంగోలి, వ్యాసరచన, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాముఖ్యత అనే అంశాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాఠశాల స్టాఫ్ సెక్రటరీ జీజె ప్రభువరం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక విరించి పాఠశాలలో విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రదర్శనలు అలరించాయి. కిడ్నీల పనితీరు, సోలార్ ట్రాక్టర్, సోలార్ కారు, సైన్సు ఆర్గాన్స్, నీటి శుభ్రత, రక్తపరీక్ష, సర్క్యులేటరీ సిస్టమ్ వంటి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సైన్స్ ప్రదర్శనలను ఇరగవరం ఎస్సై జానా సతీష్ ప్రారంభించారు.

విద్యార్థులకు బహుమతుల పంపిణీ

అత్తిలి: విద్యార్థులు సైన్సు పట్ల మక్కువ పెంచుకొని శాస్త్రవేత్తల వలె ఎదగాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ బాలసుబ్రహ్మణ్యం అన్నారు. జాతీయ విజ్ఞాన దినోత్సం సందర్భంగా శుక్రవారం అత్తిలి మండలం బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం మాట్లాడారు. డాక్టర్ సీవీ రామన్ భౌతికశాస్త్రంలో పరిశోధనల ఫలితంగా రామన్ ఎఫెక్ట్ కనిపెట్టారని, 1987 నుంచి ఫిబ్రవరి 28న జాతీయ విజ్ఞాన దినోత్సవంగా జరుపుకుంటామని చెప్పారు. శాస్త్రవేత్తల పరిశీలనా శక్తిని విద్యార్థులకు వివరించారు. ప్రతి విద్యార్థి ప్రతీ విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించడం, తెలియని విషయాన్ని తెలుసుకోవడం ద్వారా విజ్ఞానవంతులు కాగలరని అన్నారు. సైన్సు ఉపాధ్యాయిని ఎస్ సుజాతదేవి సైన్సు డే ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు తయారు చేసిన పలు సైన్సు నమూనాలను ప్రదర్శించి వాటి పనితీరును విశదీకరించారు. రిటైర్డు సైన్సు ఉపాధ్యాయుడు డీఎంజీ ప్రసాద్ సర్ సీవీ రామన్ జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. ఈసందర్భంగా సైన్సు ప్రదర్శనలు రూపొందించిన విద్యార్థులకు బహుమతులు అందజేసారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమా ప్రతిభ, వై శ్రీకాంత్, పి రాంబాబు, జి శ్రీనివాస్, టి ఆత్మలింగం పాల్గొన్నారు.



బల్లిపాడు ఉన్నత పాఠశాలలో సైన్సు ప్రదర్శనలు ఇస్తున్న విద్యార్థులు

నిరుద్యోగులకు మొండిచేయి చూపిన కూటమి

తణుకు అర్బన్: కూటమి ప్రభుత్వ బడ్జెట్ సమావేశాల్లో నిరుద్యోగులకు మొండిచేయి చూపిందని, నిరుద్యోగ భృతి ఊసేలేదని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐయస్‌ఏ) జిల్లా కార్యదర్శి టి. అప్పలస్వామి, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నాయకులు జి.ఎడ్వర్డ్ పాల్, ఏపీఎస్ నాయకులు సుశాంత్ విమర్శించారు. శుక్రవారం స్థానిక వెంకటేశ్వర సెంటర్ కూడలిలో విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో యువతకు మొండి చేయి చూపారని, గత ఎన్నికల సందర్భంగా పాదయాత్రలో కూటమి ప్రభుత్వం ఉద్యోగాలు రాని నిరుద్యోగులకు నెలకు రూ. 3వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారని కానీ అధికారం ఏర్పడి తొమ్మిది మాసాలు గడిచినా ఇచ్చిన హామీ నీటిలో రాతలుగా మారాయని విమర్శించారు. అదేవిధంగా ఉద్యోగాల కల్పన కూడా ఎక్కడ చెప్పలేదని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు ఏ.బాబు, ఎం. ఉదయ్, కె.సుమంత్, పి. వినీల్, జి. మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

తణుకులో చికెన్ మేళా..

తణుకు అర్బన్: బర్డ్‌ఫ్లూ భయం వద్దని చికెన్, కోడిగ్రుడ్లు ఆహారంగా తీసుకోవచ్చని ఆంధ్రప్రదేశ్ పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోమట్లపల్లి వెంకట సుబ్బారావు అన్నారు. తణుకు నెక్ కల్యాణ మండపంలో శుక్రవారం వెంకటేశ్వర హేచరీస్, పౌల్ట్రీ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన చికెన్ మేళాలో ఆయన మాట్లాడారు. వైరస్ కారణంగా చికెన్‌ను ఆహారంగా తీసుకోవడంలో కొన్ని అపోహలు ఏర్పడ్డాయని, నేడు ఎటువంటి వైరస్‌లు లేవని నిరభ్యంతరంగా చికెన్‌ను ఆహారంగా భుజించవచ్చని సూచించారు. తణుకు మండల పశు వైద్యాధికారి డాక్టర్ శంకర్ భావన్నారాయణ మాట్లాడుతూ చికెన్‌ను ఆహారంగా తీసుకోవచ్చని ప్రభుత్వం ప్రకటించిందని, చికెన్‌పై కొన్ని ప్రాంతాల్లో విధించిన నిషేదాజ్ఞలు నేడు తొలగింపబడ్డాయని అన్నారు. చికెన్, కోడిగ్రుడ్లు ఆహారంగా తీసుకుని శరీరానికి మంచి ప్రొటీన్‌ను పెంపొందించుకోవాలని కోరారు. చికెన్ మేళాకు అధికసంఖ్యలో ప్రజానీకం హాజరయ్యారు. అనంతరం హాజరైన వారందరికీ చికెన్ వంటకాలను అందచేశారు. ప్రాంతీయ పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కె.నరసింహారావు, పౌల్ట్రీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

స్కూల్ ఆటోను ఢీకొన్న లారీ

పెంటపాడు: మండలంలో ప్రేవేటు స్కూల్ పిల్లలతో వెళ్తున్న ఆటోను లారీ ఢీకొట్టిన సంఘటన పెంటపాడులో శుక్రవారం చోటు చేసుకొంది. ప్రమాదంలో ఆటో తృటిలో తప్పించుకోగా ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పెంటపాడు నుంచి ఆటోలో 6 గురు పిల్లలతో గూడెం పట్టణంలో ఓ ప్రేవేటు స్కూల్‌కు వెళ్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోను మలుపుతిప్పగా తృటిలో ప్రమాదం తప్పింది.